ప్రజాశక్తి

బుధవారం 24 డిసెంబర్ 2025 5

పార్వతీపురం మన్యం

29న పాలకొండలో జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 29న పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయికృష్ణ చైతన్య మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకొని 18 నిండి 28 ఏళ్లు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చున్నారు. ఈ జాబ్‌మేళాలో 10 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువత తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 6301275511, 7993795796 మొబైల్ నెంబర్లను సంప్రదించవచ్చని అన్నారు.

కూటమిలో రాజుకున్న విభేదాల కుంపటి

- జనసేన ఎమ్మెల్యేపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు
- సమన్వాయం జరగడం లేదన్న టిడిపి
- ఇన్‌ఛార్జి మంత్రి కోర్టుకు పంచాయితీ బంతి

ప్రజాశక్తి - పార్వతీపురం

అధికార టిడిపి కూటమిలో విభేదాల కుంపటి రాజుకుంది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా మిత్రధర్మం పాటించడం లేదని, పాలకొండ నియోజకవర్గంలో వివక్షకు గురవుతున్నామని టిడిపి సోమవారం ఫిర్యాదు చేసింది. టిడిపి కూటమిలో ప్రధాన భాగస్వామి అయిన తమ పార్టీ పట్ల ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అనుసరిస్తున్న వైఖరి, ఒంటెద్దు పోకడలపై గళం విప్పింది. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కనీస ప్రాధాన్యత లేదని సైకిల్ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కూడా తమ గోడు పట్టించుకోవడం లేదని టిడిపి నాయకులు, కార్యకర్తల్లో తీవ్ర నైరాశ్యం నెలకొందని వాపోయారు. పాలకొండ నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక దందాలు రాత్రివేళల్లో జరుగుతోందని, మైనింగ్ ఎడికి అనేక సార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని చెప్పారు. సోమవారం పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పడాల భూదేవి నాయకత్వంలో నాలుగు మండలాల నాయకులు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర్ రెడ్డికి లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. గత 18నెలలుగా నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు ఆహ్వానించడం లేదని పేర్కొన్నారు. కొత్త పింఛన్లు, గృహాలు, గోశాలల మంజూరులో పార్టీ నాయకులకు అన్యాయం జరుగుతోందని చెప్పారు. పాలకొండ మండలంలోని గంగాపురం, అంపిలి గ్రామాల్లో గల ఇసుక రీచ్‌ల నుంచి రాత్రి వేళల్లో ఇష్టారాజ్యంగా ఇసుక తరలింపు జరుగుతోందని తెలిపారు. దీనిపై మైనింగ్ ఎడికి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని చెప్పారు. 18నెలలవుతున్నా ఎమ్మెల్యే జయకష్ణ తీరులో మార్పు కనిపించడం లేదని, అందుకే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందరికీ అందాలనే లక్ష్యం తో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తుంటే ఎమ్మెల్యే జయకష్ణ వైఖరి అందుకు భిన్నంగా వుందని, జనసేన నాయకులు, కార్యకర్తలకే లబ్ది చేకూర్చుతున్నారని వివరించారు. గత కొంతకాలంగా నివురు కప్పిన నిప్పులా వున్న టిడిపి, జనసేనల మధ్య విబేధాలు రచ్చకెక్కాయి. గత ఎన్నికల ముందు టిడిపిలో ఉన్న ఎమ్మెల్యే జయకష్ణ టికెట్ కోసం జనసేనలో చేరారు. అప్పుడు కూడా ఇద్దరి మధ్య గ్రూపు రాజకీయాలు నడిచాయి. ఇప్పుడు కూటమిలో ఉన్నా ఇద్దరి మధ్య నెలకొన్న ప్రచ్ఛన్నయుద్ధం ప్రత్యక్ష యుద్ధానికి దారి తీసింది. ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకునే స్థాయికి విభేదాలు తలెత్తడం చర్చనీయాంశమవుతోంది.

లోకేష్ దృష్టికి వెళ్లినా?

పాలకొండ నియోజకవర్గంలో టిడిపి, జనసేన పార్టీల మధ్య కొనసాగుతున్న విబేధాల కుంపటి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి వెళ్లింది. కొద్దిరోజుల క్రితం భామినిలో మెగా పేరెంట్స్ టీచర్ సమావేశంలో పాల్గొనడానికి సిఎం చంద్రబాబు నాయుడు సహా లోకేష్ కూడా హాజరయ్యారు. ఒకరోజు ముందు భామిని మండలానికి వచ్చిన మంత్రి లోకేష్ టిడిపి, జనసేన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి పడాల భూదేవి ఎమ్మెల్యే జయకృష్ణ వైఖరి, టిడిపి పట్ల ప్రదర్శిస్తున్న వివక్ష గురించి ఏకరువు పెట్టారు. అదే విధంగా ఎమ్మెల్యే జయకృష్ణ కూడా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. విబేధాలు రచ్చకెక్కే స్థాయికి చేరడంతో లోకేష్ టిడివి, జనసేన పంచాయతీని జిల్లా ఇంఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు అప్పగించినట్లు తెలుస్తోంది.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు

ఇన్‌ఛార్జి మంత్రి కోర్టులో బంతి

పాలకొండ నియోజకవర్గంలో అధికార టిడిపి, జనసేన పార్టీల మధ్య నెలకొన్న విభేదాల కుంపటి ఇన్‌ఛార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోర్టుకు చేరింది. కూటమిలోని రెండు ప్రధాన పార్టీల మధ్య కొనసాగుతున్న విబేధాల కుంపటిని ఎలా చల్లార్చుతారనే ఉత్కంఠ నెలకొంది. పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి పడాల భూదేవి అచ్చెన్నాయుడుకు సన్నిహితులైన నాయకురాలిగా ముద్రపడ్డారు. ఎమ్మెల్యే జయకృష్ణకు మాజీ మంత్రి, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకట్రావుతో సత్సంబంధాలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో రచ్చకెక్కిన విభేదాల కుంపటి చల్లారుతుందా, మరింత రాజుకుంటుందా అనేది చర్చనీయాంశమైంది.

ప్రతి పనికీ ముందస్తు ప్రణాళికలు

- సమన్వయంతో ముందుకు సాగితే ఫలితాలు తథ్యం
- ఇ- ఆఫీస్ ద్వారా ఫైల్స్ రన్నింగ్‌లో నైపుణ్యం చూపిన డిసిఒకు కలెక్టర్ అభినందనలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మార్పు ఒక్క దగ్గర ఆగదని... మరింత మందికి ఆదర్శంగా నిలుస్తోందని, సమన్వయంతో ముందుకువెళ్తే ఫలితాలు తథ్యమని కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి వర్క్‌షాపు జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యం పెద్దదైనప్పుడు అందుకు తగ్గ ప్రణాళిక కూడా పక్కాగా ఉండాలని, అప్పుడే అభివృద్ధి సామాన్యుడి దరికి చేరుతుందని అన్నారు. ఇందుకు ముందస్తు ప్రణాళికలు చాలా కీలకమన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన వ్యవసాయ, ఉద్యానవన, అటవీ, మత్స్య, పశు సంవర్ధక, పట్టుపరిశ్రమల శాఖల పనితీరుపై కలెక్టర్ సంబంధిత శాఖల పనితీరుపై సమీక్షించారు. జిల్లాలో 15 మండలాలకు గానూ 14 మండలాలు ఏ - గ్రేడ్ లో ఉన్నాయని, పాచిపెంట మండలం బి-గ్రేడులో ఉందని, అది కూడా ముందంజలో ఉండాలని హితవు పలికారు. రాష్ట్ర స్థాయి గ్రేడింగ్‌లో జిల్లా ముందంజలో ఉందని, ఇందుకు అధికారుల కృషే కారణమని ఆనందం వ్యక్తం చేశారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిని జిల్లా ఉద్యాన అధికారి వివరిస్తూ, జిపిఎ 80 శాతం ప్రగతి సాధించిందని తెలిపారు. 2024-25లో జిల్లాలోని 272 రైతు సేవా కేంద్రాల ద్వారా రూ.3,143 కోట్ల విలువ గల ధాన్యాన్ని సేకరించగా, 2025-26లో రూ.3, 730 కోట్లు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు గ్రామ స్థాయిలో లక్ష్యాలను, సంబంధిత అధికారులకు, సిబ్బందికి తెలిసేలా ఉద్యాన పంటలకు సంబంధించిన వివరాలతో వాట్సాప్ గ్రూపులో చేయడమే కాకుండా వీడియోలు తీసి అప్లోడ్ చేయాలన్నారు. మార్కెట్లో అధిక ఆదాయం వచ్చే పంటలపై అవగాహన కల్పించాలన్నారు. సూక్ష్మ నీటి పారుదల శాఖ ద్వారా రాయితీపై బోరు మంజూరు చేస్తారని, ఇందుకోసం రైతులు ఆర్ఎస్‌కెలో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న సబ్సిడీలను విడుదల చేసి, సాగు విస్తీర్ణాన్ని పెంచడమే లక్ష్యంగా చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఇ- ఆఫీస్ ద్వారా ఫైల్స్ రన్నింగ్‌లో నైపుణ్యం చూపించిన జిల్లా కో- ఆపరేటివ్ ఆఫీసర్‌కు కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లాలో డిఆర్ఒ, డిఆర్డిఎ ముందంజలో ఉన్నారని, జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ చేపడుతున్న పనులు మరింత ముందంజలో ఉండాలని అన్నారు. మత్స్య శాఖ షెడ్యూల్ అందిన వెంటనే ఎంపిడిఒలు కావాల్సిన చర్యలు చేపట్టాలన్నారు. సాలూరు, పాలకొండ, పార్వతీపురం, గరుగుబిల్లి, మక్కువలో లబ్దిదారులను గుర్తించి మంజూరు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాధ్, సంబంధిత శాఖల అధికారులు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

జిల్లా అధికారులు, ఎంపీడీఓలు తమ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాలను విధిగా సందర్శించాలని కలెక్టర్ .ప్రభాకర రెడ్డి తెలిపారు. అధికారులు తనిఖీలకు వెళ్ళినపుడు చెక్ లిస్టు ప్రకారం అక్కడ వసతులు, సదుపాయాలు, పరిసరాల పరిశుభ్రత, ముస్తాబు, నాణ్యమైన విద్య, ఆహార నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పరిశీలించాలని చెప్పారు. . అలాగే 100 రోజుల కార్యక్రమం వసతి గృహాల్లో అమలుకావాలని, వాటి అమలుతీరును పరిశీలించాలని తెలిపారు. 10వ తరగతి చదివే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణతే లక్ష్యం కావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలనిఅధికారులకు కలెక్టర్ ఉద్బోధించారు. ప్రతీ గ్రామంలో బహిరంగ మల విసర్జనకు తావులేకుండా వ్యక్తిగత మరుగుదొడ్లను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాల విద్యార్థుల ముస్తాబు మాదిరిగా గ్రామ ముస్తాబు పక్కాగా జరగాలనిన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే ను విధిగా అమలుకావాలని చెప్పారు. డిఆర్డిఏ ద్వారా అందిస్తున్న బ్యాంక్ లింకేజి, స్త్రీ నిధి, రుణాలు వంటి వాటి వివరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం మన డబ్బులు... మన లెక్కలు అనే యాప్ ను అందుబాటులోకి కొత్త సం.లో తేనున్నట్లు చెప్పారు. మండలస్థాయిలో కూడా వర్క్ షాప్ నిర్వహించేలా ఎంపీడీఓలు చొరవ తీసుకోవాలని తెలిపారు.

కురుపాం మండలం శివన్నపేటలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ఏనుగుల సంచారంతో ప్రజలు గజగజ

20 ఏళ్లుగా వెంటాడుతున్న గజరాజుల సమస్య
ప్రభుత్వాలు మారుతున్నా పరిష్కారం శూన్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యం జిల్లాలోని కురుపాం నియోజకవర్గంలో సుమారు 20 ఏళ్లుగా అడవి ఏనుగుల సమస్య ప్రజలను వెంటాడుతుంది. ఈ 20 ఏళ్లలో వేలాది ఎకరాల్లో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఏనుగుల దాడిలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. ప్రభుత్వాలు మారినా ఏనుగుల సమస్య పరిష్కారానికి చర్యలు మాత్రం కానా రాలేదు. 2006లో ఒడిశా ప్రాంతం లఖేరి అడవుల నుంచి గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీకి 11 ఏనుగుల గుంపు వచ్చింది. ఆనాడు వీటిని తరలించే క్రమంలో, వివిధ కారణాల రీత్యా పలు ఏనుగులు చనిపోయాయి. ప్రస్తుతం కురుపాం నియోజక వర్గంలోని జియమ్మవలస, కొమరాడ, గరుగుబిల్లి మండలాల్లో ఉన్న నదీ ప్రవాహక ప్రాంతాల్లో ఏడు ఏనుగులు జనావాసాల మధ్య సంచరిస్తూ ప్రజాజీవనానికి తీవ్ర ఇబ్బందులను గురి చేస్తున్నాయి. పరిశ్రమల పేరుతో అడవులను నాశనం చేయడం వల్ల అడవిలో ఉండాల్సిన ఏనుగులకు రక్షణ కరువై, ఆహారం దొరక్క ఇలా జనావాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు అంటున్నారు. అడవుల్లో ఉండాల్సిన వన్యప్రాణులు ప్రజల మధ్య తిరుగుతూ వారి ప్రాణాలను, పంటలను సర్వనాశనం చేస్తూ జనజీవనానికి ఆటంకంగా మారాయి. దీంతో రైతులు పంట పొలాలకు వెళ్లలేక, ఇంటి వద్ద ఉండలేక బిక్కు బిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఏ క్షణాన ఏనుగుల గుంపు గ్రామంపై దాడి చేస్తుందోనని ప్రజలు అనుక్షణం భయపడుతున్నారు. నియోజక వర్గంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపును బయట ప్రాంతానికి తరలించి తమ పంటలకు రక్షణ కల్పించాలని రైతులు వేడుకుంటున్నారు.

జంఝావతి సాధనకు గ్రామ సమితులు

త్వరలో కలెక్టరేట్ వద్ద సాధన దీక్షలు

ప్రజాశక్తి - కొమరాడ

జంఝావతి ప్రాజెక్టు పూర్తిస్థాయి సాధనకు గ్రామ సమితులు ఏర్పాటు చేస్తున్నామని సాధన సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు అన్నారు. మంగళవారం ఆ సమితి ప్రధాన కార్యదర్శి రెడ్డి రాజగోపాలనాయుడు, కార్యనిర్వాహక కన్వీనర్లు మరిశర్ల మాలతీ కృష్ణమూర్తి నాయుడు, వంగల దాలినాయుడు తదితరులతో కలిసి మండలంలోని జంఝావతి ప్రాజెక్టు బాధిత గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సర్పంచులను, పెద్దలను, రైతులను కలిసి వారితో జంఝావతి సాధనకు సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. ఈ సందర్భంగా శివినికి చెందిన పొట్నూరి వెంకటనాయుడు, విక్రాంపురానికి చెందిన దేవకోటి వెంకటనాయుడు, అర్తాం సర్పంచ్ గాజల శ్రీనివాసరావు, దుగ్గికి చెందిన పిట్ట తిరుపతి, కళ్లికోట సర్పంచ్ దత్తి మురళి తదితరులను కలిసి జంఝావతి సాధన కోసం చేయాల్సిన పనులు గూర్చి చర్చించారు. ప్రాజెక్టు పూర్తి కాకపోవడంతో రైతులు కుటుంబాలతో వలస పోయే దుస్థితి ఉందని, ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని, దీనికోసం రైతులతో గ్రామ సమితులు ఏర్పాటు చేయాలని వాటి ఆవశ్యకతపై చర్చించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయా గ్రామాల్లో సమితులు ఏర్పాటు చేశారు. త్వరలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సాధన సమితి ఆధ్వర్యంలో జంఝావతి సాధన దీక్షలు ప్రారంభిస్తామన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబాటుకు ప్రాజెక్టులు పూర్తి కాకపోవడమే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

25న వావిలాల, బాపూజీ స్మారక వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లోవముత్తా ప్రాంతమైన గొరడలో ఈనెల 25న వావిలాల, బాపూజీ స్మారక వ్యవసాయ విజ్ఞాన సమాచార కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు డి. పారినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి, చైర్మన్ న్యాయ సేవధికారి సంస్థ జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్‌రాయ్ ముఖ్య అతిథిగా, గౌరవఅతిథిగా కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

అటవీ ఉత్పత్తులకు అడ్వాన్స్ టెండర్లు

ప్రజాశక్తి - సీతంపేట

గిరిజనుల నుంచి గిరిజన సహకార సంస్థచే సేకరించబడే అటవీ ఉత్పత్తులైన కొండచీపుర్లు, పసుపుకొమ్ములు, కుంకుడు కాయలు, చింతపండు వంటి వాటికి అడ్వాన్స్ టెండరింగ్ నిర్వహించనున్నట్లు ఐటిడిఎ పిఒ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట ఐటిడిఎ ఆధ్వర్యంలో ప్రతి 15 రోజులకు ఒకసారి అడ్వాన్స్ టెండరింగ్ నిర్వహిస్తామని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన వ్యాపారులు ఈ అడ్వాన్స్ టెండరింగ్‌లో పాల్గొని వారికి కావాల్సిన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసుకోవచ్చని తెలిపారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి మాధవరెడ్డి

మంత్రి పరివారంపై ఆరోపణల వెనుక కుట్ర

విచారణలో విస్తుపోయే నిజాలు : ఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిఎ సతీష్‌పైన, కుమారుడిపైన వచ్చిన ఆరోపణలు అవాస్తవాలని తేలిందని జిల్లా ఎస్‌పి ఎన్‌వి మాధవరెడ్డి చెప్పారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ గత నెలాఖరులో బూర త్రివేణి అనే మహిళ మంత్రి సంధ్యారాణి పిఎ సతీష్‌పై ఫిర్యాదు చేసిందని చెప్పారు. అదే విధంగా మీడియాతో మాట్లాడుతూ మంత్రి సంధ్యారాణి కుమారుడుపైనా త్రివేణి ఆరోపణలు చేశారని తెలిపారు. ఈ కేసును తాము చాలెంజ్ గా తీసుకుని విచారణ చేపట్టినట్లు చెప్పారు. మీడియాలో, సోషల్ మీడియాలో వైరల్ అయిన వాట్సాప్ మెసేజ్‌లు త్రివేణి, ఆమె స్నేహితుడు దేవీ ప్రసాద్ సృష్టించినవేనని విచారణలో తేలిపోయిందని చెప్పారు. త్రివేణి, ఆమె కుటుంబ సభ్యులు, దేవీ ప్రసాద్‌ల సెల్ ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించి విచారణ జరిపించామని చెప్పారు. ఫోరెన్సిక్ విచారణలో వాట్సాప్ చాటింగ్‌లు కుట్రపూరితంగా సృష్టించినవేనని చెప్పారు. విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. ఇంకా విచారణ కొనసాగుతోందని, ఎవరు ఉన్నా కేసులు నమోదు చేస్తామని చెప్పారు. పలు సెక్షన్ల కింద బూర త్రివేణి, ఆమె స్నేహితుడు దేవీ ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌పి చెప్పారు. ఈ సమావేశంలో ఎఎస్పీ, సిఐ పాల్గొన్నారు.

మంత్రికి వినతిని అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

జీతాలు చెల్లించకుంటే సమ్మెకు సిద్ధం

మంత్రికి సమస్యలు విన్నవించిన మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక మున్సిపాల్టీలో కాంట్రాక్టు కార్మికులకు చెల్లించాల్సిన జీతాలు చెల్లించడం లేదని, క్రిస్మస్, సంక్రాంతి పండగలను దృష్టిలో పెట్టుకుని పెండింగ్ జీతాలు చెల్లించేలా మంత్రి కలుగ చేసుకోవాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ సాలూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి.శంకరరావు, టి.రవి కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణికి వినతిని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ నవంబర్ నెల జీతం నేటికీ ఇవ్వేలేదన్నారు. ఈ విషయాన్ని డిసెంబర్ మొదటి వారంలో కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా బడ్జెట్ లేదని సమాధానం చెప్పారన్నారు. పట్టణంలో ప్రజలందరికీ సేవలందిస్తున్న కార్మికుల పట్ల పాలకవర్గం, ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఉండడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు చెల్లించుకుంటే ఆందోళనకు వెనుకాడమని కమిషనర్‌కు తెలిపామన్నారు. డిసెంబర్ నెల కూడా సరిపడే బడ్జెట్ లేదని కమిషనర్ నుంచి సమాధానం వచ్చిందని తెలిపారు. పండగలకు కార్మికుల కుటుంబాలను పస్తులు ఉంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ అధికారులతో చర్చించి జీతాల సమస్య పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిని అందజేసిన వారిలో యూనియన్ నాయకులు పోలరాజు, మధుమోహన్ ,శ్రీను పాల్గొన్నారు.

ప్రతి మండలంలోనూ పిక్నిక్ పాయింట్ ఉండాలి

రిజిస్ట్రేషన్ల సంఖ్య మరింత పెరగాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటన్నింటిని ప్రమోట్ చేసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. అందులో భాగంగా ప్రతి ఎంపిడిఒ వారి పరిధిలోని ప్రముఖ దేవాలయాలు, జలపాతాలు, ట్రెక్కింగ్ పాయింట్లు వంటి ప్రదేశాలను గుర్తించాలన్నారు. ప్రతి మండలంలో ఒక పిక్నిక్ పాయింట్ కచ్చితంగా ఉండాలని, ఆ దిశగా అధికారులు చొరవ చూపాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను మరింత ప్రోత్సహించాల్సి ఉందని, ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. సుపరిపాలన వారోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పలు శాఖలకు చెందిన జిల్లా అధికారులు, కమిషనర్లు, ఎంపిడిఒలతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రిజిస్ట్రేషన్ల శాఖను సమీక్షిస్తూ జిల్లాలో రూ. 52 కోట్లు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు రూ.32 కోట్లు ప్రగతిని సాధించారన్నారు. రిజిస్ట్రేషన్ల సంఖ్య మరింత పెరగాలని, ప్రభుత్వం సేకరించే ప్రజా స్పందనల సేకరణలో ప్రజల సంతృప్తి స్థాయి పెరగాలని సూచించారు. అలాగే కార్యాలయానికి విచ్చేసే క్రయ, విక్రయదారులను మర్యాదగా చూసుకోవాలని, వారికి అవసరమైన మౌలిక వసతులు కచ్చితంగా ఉండాలని కలెక్టర్ వివరించారు. రిజిస్ట్రేషన్ శాఖ పని తీరు బాగుండాలని తేల్చిచెప్పారు.

సూపర్ టీమ్ ప్రజా సేవకులుగా నిరూపించుకున్నారని పీజీఆర్ఎస్ బృందాన్ని కలెక్టర్ అభినందించారు. పిజిఆర్ఎస్ వినతుల పరిష్కారంలో సంబంధిత అధికారుల ద్వారా ఫైళ్లను క్లియర్ చేయడంలో శ్రద్ధ చూపుతున్న అధికారులను కలెక్టర్ ప్రసంశించారు. హౌసింగ్ శాఖ సమీక్షలో మాట్లాడుతూ జిల్లాలో పిఎం జన్ మాన్, పిఎంఎవై కింద 9,438 ఇళ్లకు గాను, 8 వేలు గృహాలు పూర్తయ్యాయని, మిగిలిన ఇళ్లను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో ఏడో స్థానంలో ఉన్న జిల్లా ప్రథమ స్థానంలో నిలపాలని అన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా కొత్తగా ఇళ్ల కోసం 31,325 మంది అర్హులుగా ఎంపిడిఒలు గుర్తించారని, ఇందులో అనర్హులుంటే తొలగించే వెసులుబాటు వెబ్‌సైట్ నందు ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలకు అనుగుణంగా వస్తు, వాహన విక్రయాలు ఉండాలని, ఇందుకోసం వాణిజ్య పన్నుల శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని అన్నారు. వాట్సాప్ గవర్నన్స్ గురించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం సచివాలయ సిబ్బంది వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి వాట్సాప్ గవర్నన్స్‌పై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లావ్యాప్తంగా 3,056 మంది అవగాహన కల్పించాల్సి ఉన్నప్పటికీ 2,376 మంది పాల్గొంటున్నట్లు చెప్పారు. వచ్చే శుక్రవారం శతశాతం పాల్గొనాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వాట్సాప్ సేవలపై అవగాహన కల్పించి ప్రతి గ్రామం నుంచి 100 దరఖాస్తులైన రావాలని, సేవలు అందేలా ఎంపీడీఓలు శ్రద్ధ చూపాలని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు బయోమెట్రిక్ తప్పనిసరి అని, హాజరు వేయని వారి జీతాలు నిలిపివేయాలని హెచ్ఒడిలను కలెక్టర్ ఆదేశించారు. ఈ వారంలో ఇకెవైసి పూర్తిచేయాలని, పాఠశాల తనిఖీ ప్రతీ వారం చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సంబంధిత శాఖల అధికారులు, మండల అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఎమ్మెల్యే ఆధ్వర్యాన ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

క్రిస్మస్ వేడుకలు రెండు రోజులు ముందే పార్వతీపురంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. ఈ మేరకు పేదలకు ఎమ్మెల్యే, ఆయన భార్య బోనెల అనూష చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. ఎన్‌డిఎ నాయకులు ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ కొవ్వొత్తులు వెలిగించి సంబరాలు జరుపుకున్నారు. ముందుగా క్రైస్తవ మత పెద్దలు వేదికపై ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు, ప్రజలకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయ్ నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కూటమినాయకులు, ప్రజలతో క్రిస్మస్ వేడుకలు జరుపుకోవడం మరిచిపోలేని అనుభూతి అని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలబెడతానని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యేకు కూటమి నాయకులు, అధికారులు, అభిమానులు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుసిమి జంక్షన్ వద్ద స్థానిక ఎస్ఐ వై.అమ్మనరావు ఆధ్వర్యంలో మంగళవారం వాహనాలు తనిఖీ చేపట్టారు. డ్రింకింగ్ డ్రైవ్, బ్రీతింగ్ ఎనలేషన్ తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

ఏకగ్రీవంగా యుటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - సీతంపేట

యుటిఎఫ్ సీతంపేట మండల నూతన అధ్యక్షులుగా కొండగొర్రె ఆనందరావు, ప్రధాన కార్యదర్శిగా బిడ్డిక పకీరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా కార్యదర్శి కె.కృష్ణారావు అధ్యక్షతన నిర్వహించారు. మండల గౌరవ అధ్యక్షులుగా పాలక నారాయుడు, సహాధ్యక్షులుగా పల్లరికి చంద్రకళ, జిల్లా కౌన్సిలర్‌గా బిడ్డక జయప్రకాష్, మండల కార్యదర్శి పి.శ్రీనివాసరావు, పలువురు మండల కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు. అనంతరం కృష్ణారావు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో రాత్రి బస ఉపాధ్యాయులకు లేకుండా చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అంతా ఐక్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు.

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల (కోమటి వీధి)లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు ఎన్నికల అధికారిగా మండల కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా ఎ.స్వామిబాబు, అధ్యక్షులు దుర్గా ప్రసాద్, సహాధ్యక్షులు ఎ.కృష్ణమూర్తి నాయుడు, మహిళా సహాధ్యక్షులు ఎస్.విశాలాక్షి, ప్రధాన కార్యదర్శిగా కురమాన గోవిందరావు, కోశాధికారి వాసుదేవరావు, మండల కార్యవర్గ సభ్యులు, జిల్లా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కౌన్సిల్ సభ్యులు మాట్లాడుతూ ఇచ్చిన బాధ్యతలు తూచి తప్పకుండా పాటించి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి పోరాడుతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో కె.గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు సదరం సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలి

ప్రజాశక్తి - కొమరాడ

వికలాంగులకు ఒరిజినల్ సదరం సర్టిఫికెట్లు వెంటనే ఇవ్వాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద మంగళవారం వికలాంగులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కొమరాడ సచివాలయంలో 83 మంది వికలాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, అందులో 8మందికి ఒరిజినల్ సదరం సర్టిఫికెట్లు రాకపోవడంతో ఐడి కార్డు రావడంతో చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని అన్నారు. ఈ విషయమై సచివాలయం వద్దకు వెళ్లి అడిగితే పై అధికారులకు తెలియజేశామని, మీ సమస్య కొద్ది రోజుల్లో పరిష్కారం చేస్తామని చెప్పుకొస్తున్నారు తప్ప పూర్తి స్థాయిలో తమకు న్యాయం జరగని పరిస్థితి ఉందని అన్నారు. కాబట్టి వెంటనే ఐడి కార్డుతో పాటు ఒరిజినల్ సదరం సర్టిఫికెట్ ఇచ్చి అన్ని విధాలా వికలాంగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాల ఈశ్వరరావు, సురేష్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్

జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - కురుపాం

జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం కురుపాంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వి.రామలక్ష్మి మాట్లాడుతూ బాడ్మింటన్‌లో ఎనిమిదో తరగతి విద్యార్థి డి.ప్రణీత్, చదరంగం (చెస్)లో తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎ.రాధిక, ఖోఖోలో బి.ప్రమోద్ కుమార్ జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికై పాఠశాలకు, తల్లితండ్రులకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయ సిబ్బంది, తోటి విద్యార్థులు వీరిని అభినందించారు.

వనరుల సృష్టితోనే పంచాయతీల అభివృద్ధి

ప్రజాశక్తి - కొమరాడ

పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే నిధులు కావాలని, నిధులు కావాలని అంటే వనరులు సృష్టించుకోవాలని డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్, ఇంజినీరింగ్, సర్వే అసిస్టెంట్లకు, విఆర్‌ఒలకు ఓన్ సోర్స్ రెవెన్యూపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చేయాలంటే నిధులు చాలా అవసరమని ఆ నిధులను సమకూర్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. పంచాయతీలో ఉన్న వనరులను వినియోగించుకొని నిధులను సేకరించేలా సిబ్బంది అంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సన్నీ బాబు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

కలెక్టర్‌కు సర్పంచ్ సన్మానం

ప్రజాశక్తి గుమ్మల క్ష్మీపురం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ గౌరీశంకరరావు

రాష్ట్ర స్థాయి లోనే పార్వతీపురం మన్యం జిల్లాకు విశేష గుర్తింపు తీసుకొచ్చిన జిల్లా కలెక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డిని స్థానిక సర్పంచి బొత్తాడ గౌరీశంక రావు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పాఠశాలల్లో ముస్తాబు కార్యక్రమం, రెవెన్యూ క్లినిక్‌లు వంటి వినూత్న కార్యక్రమాలకు రూపకర్తకు కలెక్టర్ చేసిన కృషికి సన్మానించారు. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో పర్యాటక (టూరిజం) అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు వంటి చర్యల్లో కలెక్టర్ చొరవ అభినందనీయం అన్నారు.

భద్రగిరి ఐటిఐ ప్రిన్సిపాల్‌గా చక్రపాణి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి రెసిడెన్షియల్ ఐటిఐ ప్రిన్సిపాల్‌గా టి.చక్రపాణి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన విశాఖపట్నంలోని నరవ ఐటిఐలో టిఒగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో పారిశ్రామిక విద్యాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అలాగే ఐటిఐలో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.

మాజీ సర్పంచ్‌ను పరామర్శించిన జోగారావు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని నిడగల్లు వైసిపి సీనియర్ నాయకులైన గాజాపు మంగమ్మ, తాతబాబును మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు మంగళవారం పరామర్శించారు. అలాగే గురువారం జరగనున్న క్రిస్మస్ వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానించారు. అలాగే మాజీ సర్పంచ్ కంది మరియదాసు కాలికి గాయమై చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న జోగారావు ఆయన వద్దకు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆయనతో పాటు జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు బలగ శ్రీరాములు నాయుడు, ప్రధాన కార్యదర్శి పోల సత్యనారాయణ, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

సమన్వయంతో కలిసి పని చేద్దాం

ప్రభుత్వ విప్ జగదీశ్వరిని కలిసిన తేజోవతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సమన్వయంతో కలిసి పని చేస్తూ ముందుకు సాగుదామని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, అరకు పార్లమెంట్ అధ్యక్షులు మోజోరు తేజోవతి సంకల్పాన్ని వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జగదీశ్వరిని తేజోవతి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం కురుపాం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై ఇరువురు నేతలు సానుకూలంగా చర్చించారు. ఈ ప్రాంత అభివృద్ధికి అవసరమైన అంశాలపై పరస్పర సహకారంతో ముందుకు సాగాలని నిర్ణయించుకున్నారు.

తేజోవతిని శాలువా కప్పి సత్కరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి; జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామకృష్ణ

తేజోవతిని కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ

కురుపాం : నూతనంగా నియమించబడ్డ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి అధ్యక్షులు మోజూరు తేజోవతిని ఉమ్మడి జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ మంగళవారం పార్వతీపురంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజా సంక్షేమం, విద్యా రంగ అభివృద్ధి, గ్రంథాలయాల విస్తరణ వంటి అంశాలపై పరస్పర చర్చించారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పఠన సంస్కృతి పెంపుపై సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని ఇరువురు నాయకులు ప్రస్తావించారు. ప్రజా ప్రయోజనాల కోసం అంతా కలిసి పనిచేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో జియ్యమ్మవలస మండల టిడిపి కన్వీనర్ జోగి భుజంగరావు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కళాసీల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న సిఐటియు నాయకులు

కళాసీల సమస్యలు పరిష్కరించాలి

సమ్మెకు సిఐటియు మద్దతు

ప్రజాశక్తి - మక్కువ

స్థానిక దుర్గ మక్కువ ఏరియా కళాసీ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న కళాసీల నాలుగో రోజు సమ్మెకు మంగళవారం సిఐటియు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు, మండల కన్వీనర్ జి.కష్ట, నాయకులు పవన్ కుమార్ సమ్మె శిబిరానికి వెళ్లి కార్మిక వర్గానికి మద్దతు తెలిపారు. అనంతరం కార్మికులనుద్దేశించి వారు మాట్లాడుతూ ప్రతి రెండేళ్లకు కూలి రేట్లు పెంపునకు సంబంధించిన అగ్రిమెంటు జరపాల్సిన వర్తక యాజమాన్యాలు నిర్లక్ష్యంగా ఉండడం వల్ల మూడేళ్లుగా ఒప్పందాలు జరగకపోవడంతో కార్మికులకు అన్యాయం చేయడమేనని అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయి చాలీచాలని రేట్లు చెల్లింపులతో కళాసీ కార్మికులు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు తగ్గట్టుగా న్యాయంగా వారి కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అసంఘటిత రంగంలో వేలాదిగా ఉన్న వివిధ డిపార్ట్మెంట్లలో కళాసీలకు ఎలాంటి భద్రతా లేకుండా ఉందని, పాలకవర్గాలకు, ప్రతిపక్షాలకు కేవలం ఓట్లు కుమ్మరించే పథకాలు మాత్రమే కోరుకుంటున్నాయని, అసంఘటిత రంగం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్నారనడానికి మక్కువ కళాసీ కార్మికుల సమ్మె ఉదాహరణని చెప్పారు. వాస్తవంగా కళాసీలు మార్కెట్లను స్తంభింప చేస్తే ప్రజలకు నిత్యవసరాలు అందవన్న విషయాన్ని వర్తక యాజమాన్యాలు, లేబర్ అధికారులు, మండల, జిల్లా స్థాయి అధికారులు గుర్తించాలని డిమాండ్ చేశారు. మక్కువ కళాసీలు చేస్తున్న డిమాండ్లపై అధికారులు కలుగ చేసుకోవాలని, వర్తక సంఘాలు న్యాయమైన డిమాండ్లను ఆమోదింప చేయాలని, లేకుంటే భవిష్యత్తులో కళాసీలకు మద్దతుగా సిఐటియు ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాసీ సంఘం నాయకులు రెడ్డి అప్పారావు, గోపాలం, వి.కృష్ణ, బి గౌరు నాయుడు, గంగరాజు, కమిటీ సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ బిల్లుపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

జాతీయ కిసాన్ దివస్‌ను పురస్కరించుకుని మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు మంగళవారం సమన్వయకర్త డాక్టర్ ఎస్.ధ్రువ వికసిత భారత్ రోజగర్, అజీవిక మిషన్ (గ్రామీణ) బిల్ - 2025పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపాదిత బిల్ ద్వారా గ్రామీణ ఉపాధి సృష్టి, వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల ప్రోత్సాహం, మహిళా సాధికారత, స్థిరమైన జీవనోపాధులకు మార్గం సుగమమవుతుందని అన్నారు. రైతుల ఆదాయం పెంపు, ఆధునిక సాంకేతికతల వినియోగం, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు విలువివ్వండి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన విద్యార్థుల ప్రాణాలకు పాలకులు ఎటువంటి విలువ ఇవ్వడం లేదని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుమ్మలక్ష్మీపురం మండలం దొరజమ్ము గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో తరుచూ గిరిజన విద్యార్థులు అనారోగ్యానికి గురౌతూ మృత్యువాత పడుతున్నారని కానీ పాలకులు మరణాల నివారణకు శాశ్వత, శాస్త్రీయ పరిష్కారం చూపడం లేదని ఆయన అన్నారు. గిరిజన విద్యార్థులకు మెరుగైన వైద్యమందించాలని కోరారు. అలాగే పూర్తిగా ఆరోగ్యం కుదుట పడే వరకు ఇంటికి వెళ్లకుండా ఆసుపత్రిలో చికిత్స పొందాలని తల్లిదండ్రులను సూచించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎంలను నియమించాలని మరోసారి రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి సాగు చేసేలా వారిని చైతన్య పరచాలని మండల వ్యవసాయ శాఖ అధికారి సిహెచ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రకతి వ్యవసాయం సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు ప్రభుత్వం అన్నివేళలా చర్యలు చేపడుతుందన్నారు. దీనిలో భాగంగా విఎఎలు ప్రకృతి వ్యవసాయ వ్యవసాయానికి సంబంధించిన సిబ్బందిని సమన్వయం చేస్తూ రైతులను చైతన్యపర్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరానికి ప్రకృతి వ్యవసాయంపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేలా గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఎపిఎం సురేష్ బాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసా యం సాగు విస్తీర్ణం పెంచేందుకు వెలుగు సిబ్బందికి అవగాహన కార్యక్ర మాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో అన్ని శాఖల సమన్వయం తో ప్రకృతి వ్యవసాయం సాగు చేసేందుకు రైతులకు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా వ్యవసాయంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు.

ఏరియా ఆసుపత్రిలో హెల్పింగ్ హేండ్స్

సీతంపేట : స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం హెల్పింగ్ హాండ్స్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా వెలుగు అసోసియేషన్ మాసింగి కొత్తూరు, లోకల్ వాలంటీర్స్, సీతంపేట ఆసుపత్రి ట్రైనింగ్ స్టూడెంట్లు, డ్రైవర్లు కలుపుకొని 30 మంది వరకు నమోదు చేశారు. ఈ రెండు కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.

పాత ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలి

ప్రజాశక్తి - మక్కువ

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన విబిజి రాంజీ గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు చేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు పీడిక ఆసిరి మాట్లాడుతూ 2005లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని, వలసలను అరికట్టడానికి అందరికీ ఉపాధి గ్యారెంటీ చేస్తూ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం 10శాతం నిధులను కేటాయింపులు జరిగేవన్నారు. ప్రస్తుతం ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ నిధులను తగ్గించే వేస్తుందని, ఇప్పుడు పూర్తిగా ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్రతో ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ జి రాంజీ చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం 60 శాతం నిధులను మాత్రమే కేటాయిస్తుందని మిగిలిన రాష్ట్ర ప్రభుత్వం భరించాలని మార్పులు కారణంగా దీనివల్ల ఉపాధి హామీ చట్టం పూర్తిగా ఎత్తివేసే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని, ఆ పథకానికి నిధులను కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా సమకూర్చాలని అలాగే పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ కూలీల పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. అనంతరం ఎపిఒ ఈశ్వరమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణకు వినతిని అందజేశారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఎపిఒ ఈశ్వరమ్మ కూలీలకు తెలిపారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు మర్రి బుగిలమ్మ, ఎం.ప్రసాద్, బొండపల్లి వెంకటి, సీతయ్య, తౌడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : పాత పద్ధతి ప్రకారం ఉపాధిహామీ చట్టాన్ని పక్కగా అమలు

ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉపాధి కూలీలు

చేయాలని, ఉపాధి కూలీలను అన్ని విధాలా ఆదుకోవాలని రైతుకూలీ సంఘం జిల్లా సహాయక కార్యదర్శి పి. శ్రీనునాయుడు అన్నారు. రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అనంతరం డిప్యూటీ ఎంపిడిఒకు వినతిని అందజేశారు. ఉపాధి కూలీలను అన్ని విధాలా ఆదుకోవాలి తప్ప ఇలా చట్టాలు తెచ్చి పేర్లు మార్చడం సబబు కాదన్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ఉపాధి హామీ కూలీలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఈ పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ఈ బిల్లును రద్దుచేసి అన్ని విధాలా ఉపాధి కూలీలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు భాస్కరరావు, కృష్ణవేణి, నాయకులు మిన్నరావు, పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పెద్దవలస పంచాయతీని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సాలూరు

మండలంలోని నార్లవలస పంచాయతీ పరిధిలో గల పెద్దవలసను పంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఎపి వ్యవసాయ కార్మికసంఘాల ఆధ్వర్యాన మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మర్రి శ్రీనివాసరావు, ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కూనేటి చినబాబు మాట్లాడుతూ నార్లవలస పంచాయతీ పరిధిలో గల పెద్దవలస, మూలవలస, భరిణికివలస, బొడ్డపాడు, దబ్బసదును, బొర్రపనుకువలస, జిల్లేడువలస, సీతన్నదొరవలస గ్రామాలను కలిపి పెద్దవలస గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కేంద్రానికి పనుల నిమిత్తం వెళ్లడానికి 10 కిలోమీటర్లకు పైగా వెళ్లాల్సి వస్తుందని, పంచాయతీ కేంద్రం అందుబాటులో లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. పెద్దవలస కేంద్రంగా కొత్త పంచాయతీని ఏర్పాటు చేయాలని గతంలో పంచాయతీ ఏర్పాటుకు తీర్మానం చేసినా పంచాయతీ ఏర్పాటు కాలేదని అన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెద్దవలస గ్రామస్తులు

ఇప్పటికైనా పంచాయతీ ఏర్పాటు వేగవంతం చేయాలని, లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తాడంగి గాసి, వార్డు మెంబర్లు కంచురి అప్పలస్వామి, తాడంగి ఇందు, పొట్టంగి రాము, కంచూరి బంగారాజు, పుర్రి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిలకాం పంచాయతీ పునర్విభజనపై గ్రామసభ తీర్మానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గరుగుబిల్లి మండలం చిలకాం గ్రామ పంచాయతీ పరిధిలోని చిలకం, దత్తివలస, కారివలస ప్రజల అభ్యర్థన మేరకు గ్రామ పంచాయతీ పునర్విభజన అంశంపై గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుతం చిలకాం గ్రామపంచాయతీ పరిధిలో చిలకం, దత్తివలస, కారివలస గ్రామాలు ఉండగా, గ్రామపంచాయతీ కార్యాలయానికి దత్తివలస, కారివలస గ్రామాలు సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు గ్రామసభలో పేర్కొన్నారు. దత్తివలస, కారివలస గ్రామాలు కలిపి సుమారు 260 ఇళ్లు ఉండగా, జనాభా సుమారు 1048 మంది ఉన్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం చిలకం గ్రామాన్ని ఒక గ్రామపంచాయతీగా, దత్తివలస, కారివలస గ్రామాలను కలిపి దత్తివలస గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామసభలో తీర్మానించి ప్రతిపాదించింది. గ్రామసభకు హాజరైన సభ్యులు ఈ ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ తీర్మానం మేరకు మంగళవారం కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కలిసి గ్రామపంచాయతీ పునర్విభజనకు సంబంధించిన వినతి పత్రాన్ని చిలకాం గ్రామ పంచాయతీ ప్రజలు అందజేశారు.

పట్టణ సిఐగా వెంకట్రావు నియామకం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బెండి వెంకట్రావు నియమితులయ్యారు. ప్రస్తుతం సిఐగా విధులు నిర్వహిస్తున్న మురళీధర్ బదిలీ అయ్యింది. ఆయన స్థానంలో గతంలో ఇదే పార్వతీపురంలో సిఐగా విధులు నిర్వహించిన బెండు వెంకట్రావును నియమిస్తూ విశాఖపట్నం డిఐజి కార్యాలయం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఏడాది క్రితం సిఐగా బాధ్యతలు చేపట్టిన మురళీధర్ దీర్ఘకాలంగా పాత బస్టాండ్ నుంచి బెలగాం శివారు వరకు ఉన్న ప్రధాన రహదారిలో ఉన్న ట్రాఫిక్ సమస్యను చక్కదిద్ది పోలీస్ ఉన్నతాధికారులు, వ్యాపార వర్గాలు, వాహనచోదకులు, పట్టణ ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. అయితే ఆయన బదిలీపై ఆయా వర్గాల నుండి తీవ్ర అసంతృప్తి వెళ్లివెత్తుతున్నాయి. అయితే ఆయన స్థానంలో సిఐగా వచ్చిన వెంకట్రావు కూడా గతంలో పార్వతీపురంలో శాంతిభద్రతల విషయంలో రాజీ పడకుండా పని చేశారు.

విద్యార్థులకు ముస్తాబు కిట్లను అందజేస్తున్న సర్పంచ్ సింహాచలమమ్మ

'ముస్తాబు'కు సర్పంచ్ సహకారం

ప్రజాశక్తి -గరుగుబిల్లి

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రతే లక్ష్యంగా కలెక్టర్ డాక్టర్ ఎం.ప్రభాకర్ రెడ్డి ప్రవేశపెట్టిన ముస్తాబు కార్యక్రమం విజయవంతానికి తోటపల్లి గ్రామ ఎసర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ, ఆ గ్రామంలోని మండల పరిషత్తు పాథమిక ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలకు ముస్తాబు కార్యక్రమానికి అవసరమైన సామాగ్రిని అందజేశారు. మంగళవారం డిప్యూటీ ఎంపిడిఒ ఎల్ గోపాలరావు సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఒ మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమమును విజయవంతం చేసేందుకు కృషి చేయడం పట్ల అభినందించారు. ఆవాల రామకృష్ణ మాట్లాడుతూ ముస్తాబు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న పిల్లలకు భోజనం చేసే ముందు చేతులు కడుక్కునేందుకు అవసరమైన సామాగ్రిని అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు.ముస్తాబు కార్యక్రమమును విజయవంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని సర్పంచి తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గోవిందు జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటీ 70 లక్షలతో అదనపు భవనం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని గంగంపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.కోటీ 70 లక్షలతో అదనపు భవనం పనులు చేపట్టేందుకు ప్రస్తుతం ఉన్న శిథిలమైన భవనాన్ని తొలగించి వాటి స్థానంలో నూతన భవన నిర్మించేందుకు జెసిబి ద్వారా తవ్వకాలు జరుపుతున్నారు. ప్రధానమంత్రి జన్మాన్ పథకంలో భాగంగా భవనం పనులు చేపడుతున్నట్లు ఆశ్రమ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది చెబుతున్నారు.

సహజ ఉత్పత్తుల ద్వారా మార్కెట్ ధర

ప్రజాశక్తి - సీతంపేట

సేకరించిన అటవీ ఉత్పత్తులు దళారులకు విక్రయించకుండా సహజ ఉత్పత్తుల కంపెనీకు అమ్ముకుంటే మార్కెట్ ధర లభిస్తుందని మన్యం సహజ ఉత్పత్తుల కంపెనీ సిఇఒ బి.శంకర్రావు అన్నారు. మంగళవారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా మండలంలోని పెద్దురులో రైతు శిక్షణా కార్యక్రమం నిర్వనిర్వహించారు. సీతంపేట వ్యవసాయ పరిశోధనా సంస్థ, ఆర్ట్స్, నాబార్డు, మన్యం సహజ ఎఫ్‌పిఒ ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. సీతంపేట వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ పి.వెంకట్రావు మాట్లాడుతూ మినుము సాగులో మెలుకువలు అనే అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కంబరవలసలో వైద్య శిబిరం

ప్రజాశక్తి- వీరఘట్టం

మండలంలోని నడుకూరు సచివాలయం పరిధి కంబరవలసలో మంగళవారం స్థానిక వైద్యాధికారి ఎం.సాయికుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్, ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్ఎం, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

రీసర్వే వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

భూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ తహశీల్దార్ వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విఆర్‌ఒల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 27 నుంచి భూరీసర్వే చేపట్టాలన్నారు. రేషన్ కార్డు లబ్ధిదారులకు ఇకెవైసి వారి యాప్‌లో చేయాలన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో స్థానిక ఎన్నికల ఓటర్లను ఆన్లైన్లో వచ్చిన దాన్నే మ్యాపింగ్ చేయాలన్నారు. సమావేశంలో ఆర్ఐ ఎన్.శ్రీనివాసరావు వివిధ గ్రామాల విఆర్వోలు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని సీతంపేటలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా మంగళవారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై బి.రాజశేఖర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల మానసిక, శారీరక, సామాజిక నష్టాలు కలుగుతాయని, యువత వాటికి దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కుమార్‌స్వామి మాట్లాడుతూ గంజాయి, నల్లమందు వంటి మాదకద్రవ్యాల వల్ల మానసిక అనారోగ్యం, ఉద్రేకత, దౌర్జన్య స్వభావం పెరిగి విచక్షణ కోల్పోతారని హెచ్చరించారు. అనంతరం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై గ్రామంలో చైతన్య ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎం.రమేష్ కుమార్, కళాశాల సిబ్బంది, ఎక్సైజ్ సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి

ప్రజాశక్తి - సీతంపేట

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

మండలం లోని ఇప్పన్నగూడ చెందిన పెద్దింటి సోమేశ్ (53) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు నుంచి సీతంపేట వైపు బైకుపై సోమేశ్ వస్తుండగా అదే సమయంలో ఎదురుగా బైకుపై యుగంధర్ వస్తున్నారు. వీరి బైకులు వెంపలగూడ బ్రిడ్జి సమీపంలో ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో సోమేసు తలకు బలమైన గాయమైంది. వెంటనే స్థానికులు సీతంపేట ఏరియా ఆసుపత్రికి ఇద్దరిని తరలించగా, అప్పటికే సోమేశ్వరరావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. యుగంధర్ తలకు బలమైన గాయం కావడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు తరలించారు. ఎస్ఐ అమ్మన్నరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.